క్లుప్తంగా

వేగవంతంగా ఆకర్ష జోన్ పనులు



నక్కవానిపాలెంలో ఆకర్ష జోన్ పనులను పరిశీలిస్తున్న జీవీఎంసీ అధికారులు

సీతమ్మధార: నక్కవానిపాలెంలో అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలం నుంచి సీతమ్మధార రైతుబజార్ వరకు ఆకర్ష జోన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వీటిని శుక్రవారం జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, ఏఈ శ్రీరామూర్తి తదితరులు పరిశీలించారు. గతంలో జీవీఎంసీ కమిషనర్ త్వరితగతిన ఆకర్ష జోన్ పనులు నిర్వహించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత



మృతుడి కుటుంబానికి నగదు అందిస్తున్న కార్పొరేటర్ అల్లు శంకరరావు

మురళీనగర్: పట్టాభిరెడ్డితోట ప్రాంతంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన టి.రాము కుటుంబానికి శుక్రవారం వైఎస్సార్ బీమా పథకం తక్షణ సాయం అందించారు. మృతుడి దహన సంస్కారాలకు గానూ మొదటి విడతగా రూ.10,000 నగదు అందజేసినట్లు డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు తెలిపారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవుడికి సుప్రభాత సేవ నేడు



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించనున్నారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

యూజీడీ లీకుతో అవస్థలు



మధురానగర్ రోడ్డులో లీకవుతున్న యూజీడీ మ్యాన్‌హోల్

సీతంపేట: స్థానిక మధురానగర్ రోడ్డు నుంచి శంకరమఠానికి వెళ్లే మార్గంలో అసెంట్ కళాశాల వద్ద రెండు యూజీడీ మ్యాన్‌హోల్స్ లీకవుతున్నాయి. మురుగు నీరు రోడ్డు పైనుంచి ప్రవహిస్తుండటంతో రెండు వారాలుగా స్థానికులు, వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

స్కూల్ గేమ్స్ సందడి

- ముగిసిన నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు
- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు



ఎన్జీజీవోస్ కాలనీ హైస్కూల్ గ్రౌండ్‌లో షటిల్ ఆడుతున్న బాలురు



కబడ్డీలో తలపడుతున్న బాలురు

సీతంపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీలు శుక్రవారంతో ముగిశాయి. అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ గ్రౌండ్‌లో ఉత్తర నియోజకవర్గ స్థాయిలో రెండో రోజు బాలురకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో గెలుపొందిన అండర్–14, అండర్–17 బాలురు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపారు. నియోజకవర్గంలోని పాలాక్స్, హరగోపాల్, ఎన్జీజీవోస్ కాలనీ, మాధవధార, కె.కాలనీ, కప్పరాడ జీవీఎంసీ హైస్కూల్స్, శారదా స్కూల్, ఎస్.ఎస్.వి.ఎస్.స్కూల్‌కు చెందిన 150 మంది విద్యార్థులు పోటాపోటీగా ఆడారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిట్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్, యోగా, షాట్‌పుట్, డిస్క్‌త్రో, 100, 200, 400 మీటర్ల రన్నింగ్ పోటీలు జరిగాయి. స్కూల్ గేమ్స్‌తో ఎన్జీజీవోస్ కాలనీ పాఠశాల మైదానంలో సందడి వాతావరణం నెలకొంది. మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని శాంతికుమారి పోటీలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎన్జీజీవోస్ స్కూల్ హెచ్‌ఎం లక్ష్మీ నరస, పీడీలు సునంద్, తబిత, పీఈటీలు త్రినాథ్, సురేష్, శారద, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

'బాలభాను' విద్యార్థుల ప్రతిభ

మురళీనగర్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో మురళీనగర్ బాలభాను విద్యాలయం విద్యార్థులు ప్రతిభ చూపారు. యోగా పోటీల్లో అండర్–17 విభాగంలో ఎస్.హెచ్.హిమాంబి, అండర్–14 విభాగంలో లక్ష్మి, అమృత, ముత్య జిల్లా స్థాయిలో ఎంపికయ్యారు. బాలికల విభాగంలో 400 మీటర్ల రన్‌లో పి.విద్యాప్రజాపతి మొదటి స్థానంలో నిలవగా.. 200 మీటర్ల పరుగు పోటీల్లో ఎం.రోహిత్, సాయి సూర్య ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బీఆర్‌కే రాజు, ప్రిన్సిపాల్ శుభశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ టి.మనోరమణి, వ్యాయామ ఉపాధ్యాయుడు సిహెచ్.రమణారావు విద్యార్థులను అభినందించారు.

ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు



50వ వార్డులో ప్రజలకు అభివాదం చేస్తున్న ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు

మద్దిపాలెం: ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు చేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 50వ వార్డు మురళీనగర్–3 279 సచివాలయం పరిధిలోని సింగరాయిమెట్ట తదితర ప్రాంతాల్లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్‌తో కలిసి ఆయన లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ప్రజలకు ఆర్థిక భరోసా ఇచ్చేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు కార్యక్రమాన్ని రూపకల్పన చేశారన్నారు. అర్హత ఉన్న చిట్టచివరి లబ్ధిదారు వరకు సంక్షేమ ఫలాలు అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని చెప్పారు. రోడ్లు, డ్రెయిన్లు, స్కూళ్లు, పార్కులు, తాగునీరు, విద్యుత్ వంటి సమస్యలు ఏమైనా ఉంటే నేరుగా ప్రజల వద్దకు వెళ్లి వినతులు స్వీకరించి ప్రతి సమస్యను పరిష్కరించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ అమర్‌రెడ్డి, 50వ వార్డు నాయకులు భగవతి విజయ్‌కుమార్, పప్పల సునీత, పైడి కృష్ణారావు మాస్టర్, పొన్నాడ అప్పారావు మాస్టర్, కంచరాన రాజేశ్వరరావు, ఏవీఎస్ రాజు, 279 సచివాలయ కన్వీనర్ చిటికెల శ్రీను, సబ్బవరం శ్రీను, చిరంజీవి, రామినాయుడు, చిన్నారావు, దుంపల సంతోష్, రాజేశ్వరి, డేనియల్ రాజు, ఎం.లక్ష్మి, సోని, త్రినాథ్, సనపల నారాయణస్వామి, సీపాన రాము, చంద్రమౌళి, బుజ్జి, రాజారావు, కృష్ణ, అర్జున్, ప్రసాద్, రఘు, పృథ్వీ, దిలీప్, పొన్నాడ రమేష్, శ్రీనివాస్‌రాజు, ఎం.వి రెడ్డి, సీనియర్ నాయకులు షేక్ బాబ్జి, ఎం.సునీల్, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఆర్పీలు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు డ్రైఫ్రూట్స్



డ్రైఫ్రూట్స్ అందుకున్న గర్భిణులు, బాలింతలతో అమెజాన్ టీం

మద్దిపాలెం: అమెజాన్ సంస్థ 'గ్లోబల్ మంత్ వాలంటీరింగ్ ఈవెంట్' పేరిట శుక్రవారం సేవా కార్యక్రమం నిర్వహించింది. 51వ వార్డు గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు సంస్థ ప్రతినిధులు డ్రైఫ్రూట్స్ పంపిణీ చేశారు. ప్రతి ఏడాది గ్లోబల్ మంత్ వాలంటీరింగ్ ఈవెంట్ పేరిట సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అమెజాన్ సంస్థ ప్రతినిధి తనూజ తెలిపారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలకు విటమిన్స్‌తో కూడిన పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. టీం సభ్యులు కొండలరావు, నరేంద్ర, అంగన్‌వాడీ టీచర్ మౌలాబీబీ పాల్గొన్నారు.

రైతుబజార్లలో అన్నదానం



సీతమ్మధార రైతుబజార్‌లో అన్నప్రసాదం వడ్డిస్తున్న ఈవో కొండబాబు,సతీష్



కంచరపాలెం రైతుబజార్‌లో అన్నదానం ప్రారంభిస్తున్న ఈవో కృష్ణమూర్తి

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లో శుక్రవారం గణపతి పూజలు ఘనంగా నిర్వహించారు. బజార్ ఈవో కొండబాబు, సహాయకుడు సతీష్ ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ చేపట్టారు. ఎంవీపీ రైతుబజార్ ఈవో ప్రసాద్, రైతులు లక్ష్మణరావు, అప్పారావు, సంతోష్, స్థానికులు, వినియోగదారులు పాల్గొన్నారు.

2 వేల మందికి..

కంచరపాలెం: కంచరపాలెం రైతుబజార్‌లో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రైతులు, డ్వాక్రా మహిళల నేతృత్వంలో అన్నదానం జరిపారు. కార్యక్రమాన్ని రైతుబజార్ ఈవో సిహెచ్.కృష్ణమూర్తి ప్రారంభించారు. సుమారు 2 వేల మందికి అన్నదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం సాయంత్రం గణేష్ నిమజ్జనం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వినియోగదారుల కమిటీ సభ్యులు, రైతులు, వ్యాపారులు, డ్వాక్రా మహిళలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జోన్–2 కార్యాలయంలో..

జీవీఎంసీ 56వ వార్డు రామ్మూర్తిపంతులుపేటలోని ఈపీడీసీఎల్ జోన్–2 కార్యాయలంలో వినాయక చవితి ఉత్సవాలను అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన విద్యుత్ గణనాథుడు ఆకట్టుకుంటున్నాడు. సిబ్బంది శుక్రవారం నిర్వహించిన భారీ అన్నసమారాధనను ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయుడు ప్రారంభించారు. సుమారు 2వేల మంది అన్నప్రసాదాలు స్వీకరించినట్లు సిబ్బంది తెలిపారు.

51వ వార్డులో..

మద్దిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులో వినాయక నవరాత్రుల సందర్భంగా అన్నసమారాధనలు నిర్వహించారు. గాంధీనగర్‌లో ఆది ఆంధ్ర సేవా సంఘం ఆధ్వర్యంలో, విద్యానగర్‌లో వైఎస్సార్‌సీపీ కార్యకర్త సీపాన విశ్వనాథం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాలను ముఖ్య అతిథి కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు.



51వ వార్డులో అన్నప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



సిరులతల్లికి క్షీరాభిషేకం

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా బిల్లు గాలిబుడగ వంటిది



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మహిళా సంఘాల నాయకులు

సీతమ్మధార : కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లు పేరుతో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 128వ రాజ్యాంగ సవరణ బిల్లు గాలిబుడగ వంటిదని అఖిలభారత మహిళా సంఘాల సమన్వయ కమిటీ ఆంధ్రప్రదేశ్ నాయకురాలు ఎం.లక్ష్మి అన్నారు. శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. బీజేపీ ఎన్నికల సందర్భంగా మహిళలకు ఇచ్చిన హామీల మాదిరే ఇది కూడా నమ్మకద్రోహం చేసేదిగా ఉందన్నారు. 2024లో జరగబోయే లోక్ సభ ఎన్నికలను ఉద్దేశించి తెచ్చారని అన్నారు. చాలా కాలంగా మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలనే డిమాండ్ ఉందన్నారు. మోదీ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో మహిళలపై హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయన్నారు.

భక్తులకు మెరుగైన సేవలందించాలి

- అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవు
- సింహాచలం దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి



అధికారులతో కలిసి పర్యటిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి దేవస్థానం అధికారులను ఆదేశించారు. సింహగిరిపై శుక్రవారం ఆయన దేవస్థానం ఇంజినీరింగ్ విభాగం, ఆలయ అధికారులతో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించారు. ముఖ్యంగా భక్తులకు మంచినీరు విరివిగా అందించే చర్యలుతీసుకోవాలని, పారిశుధ్యం మెరుగుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. అన్నప్రసాదం విభాగాన్ని పరిశీలించారు. సింహగిరికి వచ్చే ఏ ఒక్క భక్తుడు ఇబ్బందికి గురి కాకుండా చూడాలని, అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఈఈ రాంబాబు, డీఈ నాగేశ్వరరావు, ఏఈవో భ్రమరాంబ, సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావు,ఏఈ హరి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, పీఆర్వో నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీలో క్రికెట్ టోర్నీ ప్రారంభం

మహారాణిపేట : జర్నలిస్టుల క్రీడలు అభినందనీయమని, ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తి ప్రదర్శించి అందరి మన్ననలు పొందాలని సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు అన్నారు. విశాఖ వెబ్ జర్నలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మొదలైన క్రికెట్ టోర్నీని ఆయన ప్రారంభించారు.

ఆంధ్రా మెడికల్ కాలేజీ గ్రౌండ్‌లో చిన్నా మెమోరియల్ క్రికెట్ టోర్నీ పేరిట రెండు రోజుల పాటు జరగనున్న ఈ క్రీడల్లో వివిధ ప్రాంతాలకు చెందిన ఏడు జట్లు పాల్గొంటున్నాయి. కార్యక్రమంలో భాగంగా నిర్వాహకులు శ్రీనుబాబును ఘనంగా సత్కరించారు. రామకృష్ణ, మోహన్, సతీష్, నాగరాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో 'పాలంబడి'



మొక్కలు నాటుతున్న హెచ్‌ఎం శ్రీనివాసరావు, విద్యార్థులు

కంచరపాలెం: జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కూరగాయలు, మొక్కల పెంపకంపై అవగాహన కల్పించడానికి 'పాలంబడి' కార్యక్రమం చేపట్టారు. ఈ మేరకు కంచరపాలెం రామ్మూర్తిపంతులపేట ఉన్నత పాఠశాలలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్. శ్రీనివాసరావు మొక్కలు నాటారు. వంగ, టమాటా, మిర్చి, కాలీఫ్లవర్, క్యాబేజీ, దొండ, చిక్కుడు మొక్కలు, పాదులను విద్యార్థులతో నాటించారు. కార్యక్రమంలో కృష్ణయ్య, గౌరీశంకర్, సనపల రవికుమార్, పాఠశాల ఉపాధ్యాయులు పెద్దాడ వెంకటేశ్వరరావు, గోకా నిర్మల, రత్నకుమారి, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆది గణపతిగా దుర్గాగణపతి



నృత్యం చేస్తున్న చిన్నారులు



సీతంపేటలో పూజలందుకున్న ఆది గణపతి

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట కూడలిలో కొలువైన దుర్గాగణపతి ఆలయంలో వినాయక నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఐదో రోజు శుక్రవారం ఆది గణపతి అలంకరణలో దుర్గాగణపతి దర్శనమిచ్చారు. భక్తులు స్వామిని దర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కూచిపూడి నృత్యప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. శనివారం విష్ణు గణపతి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, ఈవో రమాభాయి తెలిపారు.

ఘనంగా వినాయక నవరాత్రి మహోత్సవాలు



తారకరామానగర్‌లో వినాయకుడి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కె.కె.రాజు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తారకరామనగర్‌లో శ్రీగణాంజనేయ సేవా సంఘం ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు పాల్గొన్నారు. ఆయన చేతుల మీదుగా భారీ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

- 54వ వార్డులోని సన్‌రైజ్ క్లబ్ వద్ద భారత్ పుత్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసమారాధనను కె.కె.రాజు ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ కార్యక్రమాల్లో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, వైఎస్సార్‌సీపీ 45వ వార్డు అధ్యక్షుడు, రాష్ట్ర ఎడ్యుకేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పైడి రమణ, పార్టీ నాయకులు కేపీ రత్నాకర్, హరి పట్నాయక్, తిరుపతిరావు, రాంబాబు, అప్పలస్వామి, నేపాల్ శ్రీను, సన్ని, ఆదిలక్ష్మి, దుర్గ, నాయుడు, గణపతి, రాజా, దిలీప్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా గ్రీన్ గణేషుడు



తాటిచెట్లపాలెంలో కొలువుదీరిన గ్రీన్ గణపతి

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 55వ వార్డు తాటిచెట్లపాలెంలో శ్రీ చక్ర బిల్డర్స్ ఆధ్వర్యంలో ఘనంగా వినాయక చవితి నవరాత్రి పూజా మహోత్సవాలు జరుగుతున్నాయి. ఇక్కడ ఏర్పాటు చేసిన పర్యావరణహిత గ్రీన్ వినాయకుడు భక్తులను విశేషంగా ఆకర్షిస్తున్నాడు. శుక్రవారం మండపం వద్ద షిర్డిసాయికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 30 వరకు 13 రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకుడు జయరాం తెలిపారు. ఈ ఏడాది కూడా సొంత నిధులతో వినాయక మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 30న భారీ అన్నదానం ఉంటుందన్నారు.

గణనాథుడికి కుంకుమ పూజలు



గణపతికి కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

మురళీనగర్: మురళీనగర్‌లోని పలు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. సత్యానగర్, పట్టాభిరెడ్డితోట ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం పూజలు నిర్వహించారు. మురళీనగర్ ఓం శాంతి ఆశ్రమం రహదారిలో ఏర్పాటు చేసిన వినాయకుడికి స్థానిక సత్య రెసిడెన్సీ ఆధ్వర్యంలో మహిళలు కుంకుమ పూజలు జరిపారు. కార్యక్రమంలో 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, కేసీపీ రైస్ ట్రేడర్స్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


శివపుత్రుడికి చిన్నారుల దీపారాధన



వరసిద్ధి వినాయకుడికి దీపారాధన చేస్తున్న చిన్నారులు, రాధికా ట్రస్ట్ సభ్యులు

కంచరపాలెం: వరసిద్ధి వినాయక ఉత్సవాల్లో భాగంగా రాధికా ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం గొల్లకంచరపాలెంలో దీపారాధన నిర్వహించారు. చిన్నారులు ఏర్పాటు చేసిన పందిరిలో గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. ఓంకారంలో మూడు రంగుల సర్వమత సమ్మేళనంతో చిన్నారులు దీపాలను వెలిగించి తమ దేశభక్తి చాటుకున్నారు. శనివారం అన్నసమారాధన, సోమవారం నిమజ్జన కార్యక్రమాలు జరుగుతాయని నిర్వహకులు తెలిపారు. ట్రస్టు సభ్యులు జ్యోతేష్, జశ్వంత్, మాన్విత, మనోహర్, ఆశిష్, రూపేష్, దుర్గాప్రసాద్, భాను, సిహెచ్.జశ్వంత్, సురేష్, నిఖిలా, తేజేశ్వరి, ఉషశ్రీ, శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.

రాజగణపతి అలంకరణలో సంపత్ వినాయకుడు



సీతమ్మధార: ఆశీలమెట్టలోని సంపత్ వినాయగర్ ఆలయంలో రాజగణపతి అలంకరణలో సంపత్ వినాయగర్ భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం ఉదయం నుంచి గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక ఉత్సవాల్లో భాగంగా గణపతి హోమం, నాదస్వర కచేరి, సర్వదర్శనం అనంతరం నారాయణ సేవ నిర్వహించినట్టు ప్రధాన అర్చకులు మోహన్‌స్వామి తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.